## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాల పరిశీలన


చిన్నవెల్లమిల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖాజావల్లీ

ఉంగుటూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఏలూరు ఆర్డీఓ ఖాజావల్లీ గురువారం పరిశీలించారు. బాదంపూడి, చిన్నవెల్లమిల్లి పోలింగు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ శివయ్య, వీఆర్వోలు ఉన్నారు.

### వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం


టీచర్ వెంకటేశ్వరరావును సత్కరించిన దృశ్యం

దెందులూరు: విద్యార్థులతో మమేకమై అంకితభావంతో విద్యాబోధన చేసి నూరుశాతం ఫలితాల సాధనకు మ్యాథ్స్ టీచర్ డి.వెంకటేశ్వరరావు సేవలందించారని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. గురువారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మార్గాని మనోహర్ అధ్యక్షతన మ్యాథ్స్ టీచర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి వెంకటేశ్వరరావును సర్పంచ్, పాఠశాల సిబ్బంది సత్కరించారు. జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పార్టీ నాయకులు కొండేటి గంగాధర్ బాబు, మాగంటి కృష్ణమోహన్, రామాంజనేయులు, శ్రీనివాస్, మోర్ల సుబ్బారావు, తోట పద్మారావు ఉన్నారు.

### రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన


రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఉంగుటూరు: మండలంలోని గోపీనాథపట్నం దళితవాడలో రామాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.10 లక్షలు వ్యయంతో చేపట్టే రామాలయ నిర్మాణ పనులకు గ్రామసర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు నార్నిన త్రిమూర్తులు, దళితపేట ప్రజలు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఏలూరు (టూటౌన్): చింతలపూడిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపు నిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రవి కుమార్ గురువారం ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. చింతలపూడి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, అక్కడ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాని దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నాని మాట్లాడుతూ చింతలపూడిలో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆదేశించారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారిని నడిపించేందుకు ముందుంటానని భరోసా ఇచ్చారు. అతి త్వరలోనే చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

### బిషప్ జయరావుకు సత్కారం

ఏలూరు (టూటౌన్): విశాఖ పట్టణంలోని విశాఖ అపోస్తుల అడ్మినిస్ట్రేటివ్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన ఏలూరు పీఠాధిపతి రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేరను శుక్రవారం జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ఆధ్వర్యంలో దళిత జేఏసీ నాయకులు ఘనంగా సత్కరించారు. విశాఖపట్టణంలోని జ్ఞానపురం కేథడ్రల్ చర్చిలో జయరావును గజమాలతో సన్మానించారు.

### రామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో 92వ శ్రీ రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నెల్లూరుకు చెందిన పరాయితం నారాయణాచార్యులు భాగవతార్ సతీ సుకన్య అనే అంశంపై నిర్వహించిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి విజయవాడకు చెందిన మాధురి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాయకుడు పీపీఏ ప్రసాద్ భక్తిగాన కచేరి నిర్వహించారు.

# ఒకటో తేదీనే.. ఠంచనుగా పింఛన్

- తలుపు తట్టి.. వైఎస్సార్ పింఛన్ అందజేత
- పింఛను రూ.3 వేలకు పెంచిన సర్కారు
- నాలుగేళ్లలో మండలంలో రూ.71.27 కోట్ల పంపిణీ




నిడమర్రు: అవ్వా తాతలకు, ఒంటరి మహిళలకు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసే పింఛన్లు గత పాలకులు చిన్న చూపు చూసేవారు. నాడు పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు చాంతాండత క్యూలల్లో గ్రామ పంచాయతీల వద్ద పడిగాపులుపడే దుస్థితి. నేడు వలంటీర్లు ఒకటో తేదీనే లబ్ధిదారుల గడప వద్దే పెన్షన్లు అందించే పరిస్థితి. ఆరోజు సెలవైనా, పండుగైనా సరే ఠంఛనుగా చేతికి వైఎస్సార్ పింఛను కానుక నగదు అందుతోంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హామీ మేరకు పింఛను నగదు రూ.2 వేలు నుంచి రూ.3 వేలకు పెంచుకుంటూ లబ్ధిదారులకు ఆర్థిక భరోసా ఇస్తూ, వారి ఆత్మాభిమానాన్ని నిలబెట్టే పరిస్థితికి ప్రభుత్వ పాలన చేరింది. కరోనా గడ్డుకాలంలోనూ ప్రతి ఇంటికీ ఒకటో తేదీనే పింఛను నగదు అందించిన ఘనత జగన్ సర్కారుకే దక్కుతుంది. గత నాలుగేళ్లలో మండలంలో లబ్ధిదారుల సంఖ్య పెరగడంతోపాటు రూ.71.27 కోట్లు వివిధ రకాల పింఛన్ల రూపంలో ప్రభుత్వం పంపిణీ చేసింది.

**నేడు మండలంలో 6,430 పెన్షన్లు**

నిడమర్రు మండలంలో 2020లో 5,526 మంది వివిధ వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులు ఉంటే నేడు 14 గ్రామాల్లో వారి సంఖ్య 6,430కి చేరుకుంది. 3,524 మంది వృద్ధులకు, 1,330 మంది వితంతువులకు, 768 మంది దివ్యాంగులకు, 367 మంది మత్స్యకారులకు, 441 మంది కల్లుగీత, కిడ్నీ వ్యాధి బాధితులు పింఛన్లు తీసుకునే వారిలో ఉన్నారు. ప్రతి నెలా వారికి గ్రామ సచివాలయంలో పార్టీలకు, వర్గాలకు తావులేకుండా పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హతే ప్రామాణికంగా పింఛను మంజూరయ్యే పరిస్థితి గ్రామాల్లో ఉంది. చంద్రబాబు హయాంలో ఎన్నికలకు రెండు నెలలు ముందు వరకు రూ.1,000 మాత్రమే పింఛన్ అందగా, సీఎం జగన్ ప్రభుత్వం నెలకు రూ.2,250 చొప్పున ప్రారంభించి రూ.3,000 దాకా ఏటా పెంచుకుంటూ వచ్చింది. కిడ్నీ వ్యాధి బాధితులకు ప్రతి నెలా రూ.10వేలు అందిస్తోంది. లాక్‌డౌన్ సమయంలోనూ పింఛన్ల సొమ్ము పెంపు ఆపలేదు. పింఛన్ల పంపిణీ కూడా ఆగలేదు. జగన్ ప్రభుత్వం మానవీయ కోణంలో జరిగిన సంస్కరణలతో, లబ్ధిదారుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఇంటి వద్దకే పెన్షన్లు అందిస్తున్నారు.


నిడమర్రు పంచాయితీ వద్ద కార్యదర్శి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు (ఫైల్)


నేడు నిడమర్రు గ్రామంలో ఇంటి వద్దనే రూ.3 వేలు అందుకుంటున్న ఈదేపల్లి శివ

**నాడు జన్మభూమి కమిటీలకు లంచాలు**

టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే కొత్త పింఛన్లు మంజూరైన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులందరికీ సంతృప్తస్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఇప్పుడు పెన్షన్ల కోసం దళారీలు, పైరవీకారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తమ వద్దకు వచ్చే గ్రామ వలంటీరు సహాయంతో అర్హత ఉంటే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వీలు ప్రభుత్వం కల్పించింది. అనంతరం గ్రామ సచివాలయంలోనే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.


బువ్వనపల్లిలో కిడ్నీ బాధితురాలికి నెలవారీ పింఛన్ రూ.10వేలు అందిస్తున్న వలంటీరు

**నాలుగేళ్లుగా ఇలా..**

| సంవత్సరం | లబ్ధిదారులు | పంపిణీ చేసిన నగదు |
|---|---|---|
| 2020 – 21 | 5,526 | రూ.17.31 కోట్లు |
| 2021 – 22 | 5,364 | రూ.16.79 కోట్లు |
| 2022 – 23 | 5,985 | రూ.18.33 కోట్లు |
| 2023 – 24 | 6,430 | రూ.18.84 కోట్లు |

**ఆత్మాభిమానం నిలబెట్టారు**



నాడు ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాకు ఆరోగ్యశ్రీలో గుండె ఆపరేషన్ చేయించి ప్రాణాలు నిలబెట్టారు. నేడు ఆయన కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ అందించి మాలాంటి వారికి ఎవ్వరిపైనా ఆధార పడకుండా మా ఆత్మాభిమానం నిలబెట్టారు. – చీకట్ల సత్తెమ్మ, బువ్వనపల్లి

**అర్హతే ప్రామాణికం**



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక భద్రత పింఛన్ల విషయంలో పలు సంస్కరణలు చేపట్టారు. అర్హులై ఉండీ ఒకవేళ ఏ కారణం చేతనైనా లబ్ధి పొందకుంటే వారికి మరో అవకాశం కల్పిస్తూ ఏటా జూన్, డిసెంబర్‌లలో ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇచ్చిన హామీ మేరకు నేడు రూ.3 వేలు లబ్ధిదారులకు అందిస్తున్నాం. – పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

### పవన్ కల్యాణ్‌కు గుణపాఠం తప్పదు


రంగారావు

పెదవేగి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనైతిక వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజకవర్గ లీగల్ సెల్ కోఆర్డినేటర్ బైగాని రంగారావు అన్నారు. ఫిబ్రవరి 28న తాడేపల్లిగూడెంలో జరిగినత జెండా సభలో పవన్ కల్యాణ్ సీఎం జగన్‌పై విచక్షణా రహితంగా చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సీఎం జగన్ నవరత్న పథకాలతో ప్రజల హృదయాల్లో స్థానం ఏర్పరుచుకున్నారని వివరించారు. జగన్‌ను రెండో సారి ముఖ్యమంత్రి చేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్య ఇస్తూ, అణగారిన వర్గాలకూ శాసనసభలో ప్రాతినిధ్యం కలిగేటట్లు జగన్ చేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ తన పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో ఘోరంగా ఓడిపోయారని, ఈ సారైనా గెలవడానికి ప్రయత్నించాలని, చంద్రబాబు నాయుడు చేతిలో మోసపోవద్దని సూచించారు.

### మహిళా ఉద్యోగులపై ఫిర్యాదు

భీమడోలు: గుండుగొలను సొసైటీ కీలక పత్రాలను బయట వ్యక్తులకు అందిస్తున్న ఆ సొసైటీ ఇద్దరు ఎస్ఎంఆర్ మహిళా ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నంద్యాల సుబ్బరాజు బుధవారం రాత్రి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొసైటీ ఏఎస్ఆర్ కార్యదర్శి తిరుమలశెట్టి వీరవేణి, అటెండర్ గరికిపాటి నాగమణి తన అనుమతి లేకుండా గతంలో సొసైటీ చైర్‌పర్సన్‌గా పని చేసి విచారణ ఎదుర్కొంటున్న వగ్వాల భాస్కర్‌కు కీలక సమాచారం చేరవేశారని తెలిపారు. వారి కదలికలు సీసీ పుటేజ్‌లో స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# అన్నివర్గాల ప్రజలకూ న్యాయం చేసిన జగన్



సీతంపేటలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీతంపేట నుంచి ఈజీకే రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: అన్ని వర్గాలకు న్యాయం చేసిన గొప్ప ప్రజానాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొనియాడారు. గురువారం సీతంపేటలో గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత అధ్యక్షతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, సీతంపేట నుంచి ఈజీకే రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ప్రజల అవసరాలు పటిష్టమైన పాలనావ్యవస్థ, సేవ ఏర్పాటు చేయలేదని గుర్తుచేశారు. చిన్న వయస్సులోనే రాష్ట్రమంతా తిరిగి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని ఇచ్చిన హామీలతో పాటు చెప్పని వాటిని అమలు చేసి దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నూరుశాతం అమలు చేస్తున్నట్టు చెప్పారు. సీతంపేట అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఉదయభాస్కర్, కోటిపల్లి సత్తిరాజు, ఎంపీటీసీలు పులవర్తి వరమణి, సంతోష్, దిలీప్, బాలకృష్ణ, ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


మానూరు సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

**కొల్లేరు గ్రామాల్లో జగన్‌తోనే అభివృద్ధి**

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చూసి ఓటేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కోరారు. గురువారం ఆయన ఏలూరు రూరల్ గ్రామాల్లో రూ.2.43 కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మహేశ్వరపురం వద్ద రూ.1.90 కోట్లతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌తో పాటు మైక్రో ఫిల్టర్ బెడ్లు, రూ.40 లక్షలతో పూర్తి చేసిన మానూరు సీసీ రోడ్డు, రూ.7 లక్షలతో కల్వర్ట్, మరో 6 లక్షలతో ఏర్పాటుచేసిన తాగునీరు బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానికులు రూ.30 లక్షలతో చేపట్టిన కల్యాణ మండపం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పెదయాగనమిల్లిలో రూ.38 లక్షలతో పూర్తిచేసిన సచివాలయం, రూ.21లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పెద్ద ఎత్తున చేపట్టామని చెప్పారు. టీడీపీ హయాంలో కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి జాడే లేదని విమర్శించారు. నేడు కొల్లేరులోని ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు మౌలిక వసతులు కల్పించడంతో పాటు సచివాలయం, వైఎస్ఆర్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, డైరెక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, శ్రీపర్రు సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి, సైదు వజ్రం, పెదయాగనమిల్లి సర్పంచ్ బలే నాగసులోచన, ఉపసర్పంచ్ సైదు విజయలక్ష్మి, బలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'సమన్వయంతో ఎన్నికలకు సిద్ధమవుదాం'


సమావేశంలో మాట్లాడుతున్న సంకు నాగశేషు


భారీగా హాజరైన బావాయిపాలెం పార్టీ శ్రేణులు

నిడమర్రు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమన్వయంతో కృషి చేయాలని ఆ పార్టీ స్టేట్ యూత్ సెక్రటరీ సంకు నాగశేషు అన్నారు. గురువారం బువ్వనపల్లి గ్రామంలో శేషు అతిథిగృహంలో బావాయిపాలెం గ్రామానికి చెందిన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశం మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ గ్రామం నుంచి భారీగా పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో బావాయిపాలెం గ్రామానికి పార్టీ బాధ్యులుగా సంకు నాగ శేణును ఎమ్మెల్యే వాసుబాబు నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నిడమర్రు బాధ్యుడు పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుబాబు గత 58 నెలలుగా ప్రజా క్షేత్రంలోనే ఉన్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో మరోసారి వాసుబాబు గెలుపుకు గ్రామాల వారీగా టీమ్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. వీరంతా సమన్వయంతో వాసుబాబు విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి వ్యక్తికీ భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆ ఇంటికి గత నాలుగేళ్లుగా మంచి జరిగిందంటేనే ఓటు అడిగే సత్తా వైఎస్సార్ సీపీ కార్యకర్తలకే ఉందని అన్నారు. సమావేశంలో పార్టీ బువ్వనపల్లి, బావాయిపాలెం గ్రామాల అధ్యక్షులు కాన్వెంట్ శ్రీను, నాగిశెట్టి సుబ్బయ్య, పుప్పాల శ్రీనువాసు, రైతు నాయకులు గొట్టుముక్కల విశ్వనాథరాజు, మాజీ ఎంపీటీసీ బొబ్బిలి వెంకటేశ్వరరావు, సంకు పద్మాకరరావు, వాంశెట్టి రాము, దారాబత్తుల సత్రయ్య, బొబ్బిలి శ్రీను, బొబ్బిలి సోమేశ్వరరావు, వాసంరాజు, ముత్యాల మురళి ఉన్నారు.



# రైతు భరోసా సాయం జమపై హర్షం

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద మూడో విడత పెట్టుబడి సాయం రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రైతులు రబీ సాగు చేసిన 2021–22, ఖరీఫ్ సాగు 2022 సీజన్లకు రైతు కుటుంబాలకు సున్నావడ్డీ రాయితీని చెల్లిస్తుంది. కోవిడ్ వంటి కష్టకాలంలోనూ రైతన్నలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పెట్టుబడి సాయం చేస్తూ జగనన్న ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఏటా రైతులు, కౌలు రైతుల కుటుంబాలకు రూ.13,500 చొప్పున నాలుగేళ్లుగా ఆర్థిక సాయం అందించింది. మూడో విడతగా ఒక్కొక్క రైతుకు రూ.2 వేలు చొప్పున భీమడోలు మండలంలో అర్హులైన రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. లబ్ధిదారుల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. లక్ష లోపు పంట రుణాలను పొంది వాటిని సకాలంలో బ్యాంకులకు జమ చేసిన రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 2021–22 రబీ, 2022 ఖరీఫ్ సీజన్లలో రుణాల పొంది సక్రమంగా చెల్లించిన రైతుల ఖాతాల్లో నగదును జమ చేశారు. రైతు భరోసా కింద భూ యాజమానులు 4,174 మందికి రూ.56.35 లక్షలు, కౌలు రైతులు 628 మందికి రూ.12.56 లు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో రబీ సీజన్ 447 మందికి రూ.8.23 లక్షలు, ఖరీఫ్‌లో 436 మంది రైతులకు రూ.8.11 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసినట్టు ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి తెలిపారు.


ఆర్‌బీకేల్లో రైతుల జాబితాలను పరిశీలిస్తున్న రైతులు, ఏఓ ఉషారాణి, ఎంపీటీసీ గోపి

## పరీక్షలు సజావుగా నిర్వహించాలి


ఇన్విజిలేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఉంగుటూరు: ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, ఇన్విజిలేటర్లతో ఆయన పరీక్షల సన్నాహక సమావేశం నిర్వహించారు. విద్యార్థులు శుక్రవారం ఉదయం 8.30కే పరీక్ష హాలులో కూర్చోవాలని సూచించారు. 9 గంటలకు అనుమతి ఉండదని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ కళాశాలకు చెందిన 137 మంది, గీతాంజలి కళాశాల విద్యార్థులు 51 మంది పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. పరీక్షల కోసం ఐదు గదులు కేటాయించామని తెలిపారు. మెడికల్, పోలీసు, బందోబస్తు సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామని, మంచినీరు సదుపాయం కల్పించామని ఆయన వివరించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ జోత్స్నదేవి, డిపార్టుమెంటల్ ఆఫీసర్ నాగేశు మాట్లాడారు.



# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- భీమడోలులో రెండు పరీక్షా కేంద్రాలు

భీమడోలు: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ బోర్డు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలు పగడ్బంధీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష హాల్‌లోకి అనుమతించే ప్రసక్తే లేదని అధికారులు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్‌లను ఏర్పాటు చేసిందన్నారు. కోవిడ్ నేపథ్యంలో గత రెండేళ్ల పాటు ఆలస్యంగా పరీక్షలు జరగ్గా, ఈ ఏడాది యథావిధిగా పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్చి ఒకటో తేదీ శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు. అరగంట ముందే కేంద్రానికి వెళ్లేందుకు అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి ప్రవేశం లేదు. మాస్ కాపీయింగ్‌కు అస్కారం లేకుండా నిఘా ఏర్పాటుచేశారు. మండలంలోని భీమడోలు శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాలలో జూనియర్ ఇంటర్ 179 మంది, సీనియర్ ఇంటర్‌లో 186 మంది పరీక్షలు రాయనున్నారు. పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాలలో జూనియర్ ఇంటర్ 232 మంది, సెకండియర్ పరీక్షలకు 209 మంది రాయనున్నారు. ఈ కేంద్రాల్లో పోలసానిపల్లి, భీమడోలు, గుండుగొలను, గుణ్ణంపల్లి, ద్వారకాతిరుమలకు చెందిన కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఆయా కేంద్రాల్లో ఒక్కో గదిలో 24 నుంచి 30 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరికి ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు, మంచినీటి సదుపాయాల వంటి మౌలిక వసతులను కల్పించారు.


భీమడోలు జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా